సాక్షి
మంచిర్యాల
బుధవారం, 1, మే, 2024



పథకాల పేరిట మోసం

పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. జిల్లాలో ఎన్నికల ప్రచారం చేశారు. IIలో▸



ఎన్నికలు పారదర్శకంగా..

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. చెన్నూర్‌లో పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. IIలో▸



వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. వేడి గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

పదిలో కాస్త మెరుగు..!



10జీపీఏ సాధించిన జెడ్పీహెచ్‌ఎస్ తీగపహాడ్ విద్యార్థి చరణతేజను అభినందిస్తున్న డీఈవో యాదయ్య

- రాష్ట్రస్థాయిలో 20వ స్థానం
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా
- ఉత్తీర్ణత శాతం 92.42

మూడేళ్లుగా 'పది' ఫలితాలు

సంవత్సరం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	ఉత్తీర్ణతశాతం బాలురు	బాలికలు	శాతం
2021-22	10522	9528	88.44	99.82	90.55
2022-23	10071	8552	82.91	87	84.87
2023-24	9283	8579	91.36	93.52	92.42

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగైంది. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 20వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 23వ స్థానంలో నిలిచిన జిల్లా ఈసారి మూడడుగులు ముందుకు రావడం కొంతమేర ఊరటనిస్తోంది. ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. 2023-24లో 'పది' పరీక్షలకు జిల్లాలోని 244 పాఠశాలలకు చెందిన 9,283మంది విద్యార్థులు హాజరు కాగా 8,579మంది ఉత్తీర్ణత సాధించారు. 704మంది అనుత్తీర్ణులయ్యారు. లోకల్‌బాడీలో 416మంది, ప్రైవేటు పాఠశాలకు చెందిన 121మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. బాలురు 4,748 మంఇకి గాను 4,338 మంది, బాలికలు 4,535మందికి గాను 4,241 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 91.36శాతం కాగా బాలికలు 93.52శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. గత ఏడాది 84.87 ఉత్తీర్ణత శాతం సాధించగా ఈ ఏడాది 94.42శాతంతో 7.55 ఉత్తీర్ణత శాతంతో ముందుకు వెళ్లింది. రాష్ట్ర స్థాయిలో ఆశించిన స్థానంలో నిలవకపోయినా మునుపెన్నడూ లేని విధంగా ఉత్తీర్ణత శాతం పెరగడం ఉపశమనం కలిగిస్తోంది.

శత శాతం పాఠశాలలు 71

శత శాతం ఫలితాల్లో జిల్లా ప్రభుత్వ పాఠశాలలు దూసుకెళ్లాయి. మొత్తం ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల్లో 71 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 42 కాగా ప్రైవేటు పాఠశాలలు 29 ఉన్నాయి. గత ఏడాది సర్కారు పాఠశాలలు 22 కాగా ఈసారి 42 పాఠశాలలు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయి. లోకల్‌బాడీలో 21, ఎంజేపీ 5, టీఎంఆర్‌ఎస్ 2, టీఎస్‌ఎంఎస్ 2, టీఎస్‌ఆర్‌ఎస్ 1, టీడబ్ల్యూఆర్‌ఎస్ 3, కేజీబీవీ 3, ఎయిడెడ్ 1, ఏహెచ్‌ఎస్ 4 పాఠశాలలు శతశాతం ఫలితాలు సాధించాయి.

10జీపీఏలోనూ వెనుకబడి..

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 20వ స్థానంలో నిలిచిన జిల్లా 10జీపీఏ సాధించడంలో వెనుకబడిపోయింది. గతేడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 42 మంది 10జీపీఏ సాధించగా ఈసారి 28 మందితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జిల్లాలో 188 మంది 10జీపీఏ సాధించగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 160 మంది, 28 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నారు.

పాఠశాలల వారీగా..

యాజమాన్యం	స్కూళ్ల సంఖ్య	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత
లోకల్‌బాడీ	100	2948	2532
ఎయిడెడ్	03	69	66
జీఏహెచ్‌ఎస్	13	431	393
జీహెచ్‌ఎస్	07	206	160
కేజీబీవీ	18	527	483
ఎంజేపీ	07	486	485
టీఎంఆర్‌ఎస్	03	151	151
టీఎస్‌ఎంఎస్	05	469	443
టీఎస్‌ఆర్‌ఎస్	01	59	59
టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్	09	677	668
ప్రైవేట్	78	3260	3139

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 98శాతం



తోట నీతుచైత్ర

మంచిర్యాలటౌన్: తెలంగాణ మైనా రిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న మూడు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. మంచిర్యాలలోని బాలికల మైనారి టీ పాఠశాలలో 61 మంది విద్యార్థినులకు 61 మంది, బెల్లంపల్లి బాలికల పాఠశాలలో 39 మందికి 39 మంది వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. చెన్నూరు బాలుర పాఠశాలలో 54 మందికి 51 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మూడు పాఠశాలల్లో మొత్తంగా 98శాతం ఉత్తీర్ణత సాధించారని, దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన తోట నీతు చైత్ర మంచిర్యాల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చదివి 10జీపీఏ సాధించినట్లు తెలిపారు.

'సీఓఈ'లో వంద శాతం ఉత్తీర్ణత

- 74మంది ఉత్తీర్ణత
- ఆరుగురికి 10జీపీఏ



విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 74మందికి గాను అందరూ ఉత్తీర్ణులు కాగా ఆరుగురు విద్యార్థులు అల్లాటి వినయ్, బొల్లం అభినయ్ తేజ్, జాడి జశ్వంత్, చిగిరి వినిల్‌కుమార్, జంగంపల్లి ప్రణయ్‌చరణ్, బుక్య శశివర్ధన్ 10జీపీఏ సాధించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందిని ఆదిలాబాద్ రీజియన్ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, ప్రిన్సిపాల్ సైదులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అల్లాటి వినయ్



బొల్లం అభినయ్‌తేజ్



చిగిరి వినిల్‌కుమార్



జాడి జశ్వంత్



ప్రణయ్‌చరణ్



బుక్య శశివర్ధన్

ప్రతీ అంశంపై అవగాహన ఉండాలి

- ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: పార్లమెంటు ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల రెండ్రోజుల శిక్షణ కార్యక్రమానికి మంచిర్యాల ఆర్డీవో రాములుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు హ్యాండ్‌బుక్ పూర్తిగా చదివి అవగాహన పెంచుకోవాలని, పోలింగ్ సమయంలో సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలింగ్ రోజున ప్రతీ 2 గంటలకు పోలింగ్ శాతాన్ని సెక్టార్ అధికారులకు అందించాలని సూచించారు. పోలింగ్ జరిగే 90 నిమిషాల ముందు ఇద్దరు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్‌పోల్‌లో అన్ని పార్టీలకు ఓట్లు పోల్ అయ్యేలా చూడాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ రోజు సాయంత్రం 4 గంటల్లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణపై అనుమానాలు ఉన్నట్లయితే మాస్టర్ ట్రైనర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వేసవి ప్రత్యేక రైలు ప్రారంభం

మంచిర్యాలక్రైం: రైలు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏప్రిల్ 30 నుంచి మే 28 వరకు వేసవి ప్రత్యేక రైలు నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మే 4, 7, 11, 14, 18, 24, 25, 28వ తేదీల్లో బిలాస్‌పూర్ నుంచి యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ నుంచి బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను మే 2, 6, 9, 13, 16, 20, 23, 27, 30వ తేదీల్లో సమ్మర్ స్పెషల్ ట్రైన్‌గా నడిపించనున్నట్లు తెలిపారు. బిలాస్‌పూర్, భాటపార, రాయ్‌పూర్, దుర్గరాజ్, నండ్‌గాన్, డొంగార్గార్, గోందియా, బల్లార్ష, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, రాయ్‌చూర్, ఆదోని, గుంతకల్, ధర్మవరం, యెలహంక, యశ్వంత్‌పూర్ స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు. రైలు ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదు



సుబ్బరాయుడును సన్మానిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జీసీ.సుబ్బరాయుడు మంగళవారం పదవీ విరమణ సందర్భంగా నస్పూరులోని కలెక్టరేట్‌లో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్, ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు అండగా మోదీ'



పార్టీలో చేరిన వారితో శ్రీనివాస్, రఘునాథ్

జైపూర్/మంచిర్యాలటౌన్: పేదలకు అండగా ప్రధానమంత్రి మోదీ నిలుస్తున్నారని పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. మంగళవారం జైపూర్‌లోని దుబ్బపల్లి పీఎల్ఎస్ఆర్ గార్డెన్‌లో నర్వ సర్పంచ్ దూట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు బీజేపీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. మంచిర్యాలలో మంగళవారం సాయంత్రం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా నుంచి ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ, అనంతరం యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోగిని సురేశ్, జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్, తుల ఆంజనేయులు, దుర్గం అశోక్, ఆరుముల్ల పోషం పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మంచిర్యాలటౌన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మంగళవారం జిల్లా కేంద్రంలోని ఒడ్డెర కాలనీ, లక్ష్మీనగర్, గౌతమినగర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

'బీఆర్‌ఎస్, బీజేపీ మోసపూరిత పాలన'



ఉపాధి కూలీలతో ఎమ్మెల్యే వినోద్, వంశీకృష్ణ

బెల్లంపల్లి/వేమనపల్లి: పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, బీజేపీలది మోసపూరిత పాలన అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ విమర్శించారు. మంగళవారం వేమనపల్లి మండల కేంద్రంతోపాటు గొర్లపల్లి కొత్త కాలనీ, నీల్వాయి గ్రామాల్లో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం రాత్రి బెల్లంపల్లిలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని ప్రదర్శించాలని అన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, పీసీసీ సభ్యుడు చిలుముల శంకర్ పాల్గొన్నారు.

ముగ్గురు కౌన్సిలర్ల చేరిక

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు బొడ్డు నారాయణ, దామెర శ్రీనివాస్, పోతరాజుల లీల మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ కండువా కప్పి ఆహ్వానించారు.

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

- హాజీపూర్‌కు ఇండస్ట్రీయల్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- ఉత్పత్తుల విక్రయాలకు యాప్ తయారీకి సహకారం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, వేదికపై ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతోపాటు సాగు విస్తరించేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మంచిర్యాల వైశ్య భవన్‌లో హాజీపూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్, సేంద్రియ ఆహార ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాను ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. సేంద్రియ రైతుల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్ల ప్రారంభించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో వివిధ రకాల రసాయనికాలతో సాగు చేసిన ఆహార ఉత్పత్తులతో భవిష్యత్‌లో మానవ మనుగడ ప్రశ్నార్థకం కానుందని అన్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించాలనే విషయంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమాలోచన చేశారని, త్వరలోనే సేంద్రియ సాగు రైతులతో సీఎం సమావేశం అయ్యేలా చూస్తానని చెప్పారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కోరిక మేరకు మంచిర్యాలలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుతోపాటు త్వరలోనే హాజీపూర్ మండల పరిధిలో స్థలాన్ని సేకరించి ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేసేలా చూస్తామని తెలిపారు. చేనేత తదితర అన్ని రకాల వ్యాపారాలకు ఇండస్ట్రీయల్ పార్క్ దోహదపడుతుందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పండ్లు, కూరగాయలు పండించే రైతులు, చేపలు, పాడి రైతులకు అందుబాటులో ఉంటుందని అన్నారు. సేంద్రియ ఆహార ఉత్పత్తులు ఇళ్లకు చేరేలా సంస్థలతో మాట్లాడుతామని, పండ్లు, కూరగాయలు కూడా ఆన్‌లైన్‌లో విక్రయించేలా ప్రత్యేక యాప్‌ల రూపకల్పనలో సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ రైతులు మొదటి దశలో వరి, రెండవ దశలో పప్పు దినుసులు, మూడవ పంటగా కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. పంట మార్పిడి విధానం వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ నేటి యువత వ్యవసాయ రంగంవైపు దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, హాజీపూర్ రైతు ఉత్పత్తి సంస్థ గౌరవ సలహాదారుడు గోనె శ్యాంసుందర్‌రావు, హాజీపూర్ అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, డైరెక్టర్‌లు పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, తిరుపతి, బొడ్డు భూమన్న, గ్రామభారతి అధ్యక్షుడు రాజిరెడ్డి, సేంద్రియ సాగు రైతులు పాల్గొన్నారు.

జిల్లాకు సేవ చేసేందుకే బీజేపీలో చేరా

- కాంగ్రెస్‌లో ఒకే కుటుంబానికి టికెట్లు
- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత

మంచిర్యాలటౌన్: జిల్లాకు సేవ చేసేందుకే బీజేపీలో చేరానని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన తాను జిల్లాకు సేవ చేసేందుకు గ్రూప్-1 అధికారిగా ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని వదిలి, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గత ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందానని, సేవ చేయాలన్న సంకల్పం నెరవేరకపోవడంతో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో ఫిబ్రవరి 6న చేరానని, రెండు నెలల 24 రోజులపాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతానికి తానేమీ చేయలేకపోయానని, అందుకే బీజేపీలో చేరానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనకు సహకరించడం, తాత నుంచి తండ్రి, కొడుకు, మనవడు ఇలా ఒకే కుటుంబానికి చెందిన వారికే టికెట్లు ఇస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని సమాధి చేసిన పార్టీ అని, కాంగ్రెస్‌లో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి డబ్బులు లేకుంటే టికెట్లు ఇవ్వలేదని విమర్శించారు. డబ్బులు ఉన్నాయని ఒకే కుటుంబ వ్యక్తులకు టికెట్లు ఇస్తున్నారని, ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న దళిత నాయకులకు అన్యాయం జరుగుతున్నా కాంగ్రెస్ పార్టీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, తులా ఆంజనేయులు, రజనీశ్‌జైన్, పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుకు వృద్ధురాలు మృతి

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన కామెర భూమక్క(75) పాముకాటుకు మృతి చెందినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఈ నెల 27న వృద్ధురాలు తన ఇంటివద్ద పనిచేసే క్రమంలో నాగుపాము కాటేసింది. గమనించిన కుటుంబ సభ్యులు దండేపల్లి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచి ర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు పోషం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట చెక్ పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.58,400 నగదు పట్టుకున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి విక్రమ్‌రెడ్డి, ఏఎస్సై పున్నం, హెడ్ కానిస్టేబుల్ లింగన్న, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మారిస్తే రిజర్వేషన్లు కోల్పోతాం'

మంచిర్యాలటౌన్: బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తామంటోందని, మాదిగలు రిజర్వేషన్లు కోల్పోతారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు తాము వ్యతిరేకం కాదని, మందకృష్ణ మాదిగ తమ కుటుంబంపై రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎమ్మార్పీఎస్, మాదిగ రిజర్వేషన్ పోరాట హక్కుల సమితి, మంచిర్యాల జిల్లా యాదవ సంఘాలు తీర్మానం చేశారు.

'ఆయన' గెలిచారు.. ఆమెకు తెలియదు



2004లో ఎంపీలు కేసీఆర్, ఆలె నరేంద్ర, వినోద్ కుమార్, రవీందర్ నాయక్‌లతో మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

- ఎంపీగా మధుసూదన్‌రెడ్డి ఎన్నిక
- అప్పటికే ఆయన భార్య కోమాలో..
- మూడేళ్ల తర్వాత అదే పరిస్థితిలో మృతి

సాక్షి, ఆదిలాబాద్: జీవితంలో ఎవరైనా ఏదైనా సక్సెస్ సాధిస్తే మొదట కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటారు.. అయితే మాజీ ఎంపీ మధుసూదన్‌రెడ్డికి మాత్రం ఈ సంతోషం పంచుకునేందుకు ఆ అవకాశం లేకుండా పోయింది.. ఆయన భార్య అప్పటికే విగత జీవి.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆయన పేరు ఖరారైన తర్వాత కొద్ది రోజులకు ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కారులో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా తుప్రాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె తీవ్ర గాయాల పాలై కోమాలోకి వెళ్లిపోగా ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మార్చిలో ఈ ప్రమాదం జరగగా ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. మూడేళ్ల తర్వాత ఆయన ఎంపీగా ఉన్న కాలంలోనే ఆమె అదే పరిస్థితిలో ఈ లోకం విడిచి వెళ్లిపోయింది.

న్యాయవాద వృత్తి నుంచి..

ఆదిలాబాద్‌లో టి.మధుసూదన్‌రెడ్డి అప్పటికే దశాబ్దాలుగా ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు. అప్పుడు 58 ఏళ్ల మధ్య వయస్సు.. భార్య భూలక్ష్మి, అప్పటికే పెళ్లిళ్లు జరిగిన కుమారుడు ప్రకాష్‌రెడ్డి, కూతురు సంగీత, మనుమలు, మనుమరాళ్లతో సంతోషంగా గడుపుతున్నారు. 2004లో ఆయనకు బీఆర్ఎస్ నుంచి ఆదిలాబాద్ ఎంపీ టిక్కెట్ ఖరారైంది. మార్చి 1న ఆయన ఆదిలాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది కూతురి వివాహం హైదరాబాద్‌లో ఉండడంతో మధుసూదన్‌రెడ్డి భార్య భూలక్ష్మితో కలిసి కారులో డ్రైవర్‌తో సహా బయల్దేరి వెళ్లారు. అయితే మార్గమధ్యలో మధుసూదన్‌రెడ్డి కారు నడుపుతుండగా భార్య ముందర కూర్చుంది. డ్రైవర్ వెనుక సీటులో ఉన్నాడు. తుప్రాన్ వద్ద అనుకోని పరిస్థితిలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భూలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా మధుసూదన్‌రెడ్డికి మెడ వద్ద స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ ఇద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే భూలక్ష్మి కోమాలోకి వెళ్లిపోయింది. మధుసూదన్‌రెడ్డి చికిత్స అనంతరం తేరుకున్నారు. ఏప్రిల్ 20న 14వ లోక్‌సభ మొదటిదశ ఎన్నికలు జరిగాయి. మే 13న ఫలితాలు వెలువడ్డాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి 4,15,429 ఓట్లు, టీడీపీ అభ్యర్థి వేణుగోపాల్‌చారి 3,74,455 ఓట్లు సాధించారు. ఆదిలాబాద్ ఎంపీగా మధుసూదన్‌రెడ్డి గెలిచారు. ప్రముఖ న్యాయవాదిగా తన విజయాన్ని చూసిన భాగస్వామి భూలక్ష్మి ప్రజాప్రతినిధిగా ఎంపికయ్యారన్న విషయం కూడా తెలియకుండానే కోమాలోనే 2007లో ఆమె కన్ను మూశారు.



భార్య భూలక్ష్మితో మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

మొదటిసారి ఎన్నికల్లో..

బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ 2001 సంవత్సరంలో ఆవిర్భవించింది. 2004 సాధారణ ఎన్నికల్లో యూపీఏ భాగస్వామ్య పార్టీలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేసింది. కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో కలిసి రాష్ట్రంలో పోటీ చేసింది. కొత్త పార్టీగా ఆ ఎన్నికల్లో 26 అసెంబ్లీ స్థానాలతో పాటు ఐదు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల్లోనే ఆదిలాబాద్ ఎంపీగా మధుసూదన్ రెడ్డి గెలిచారు. ఆ ఐదుగురు ఎంపీల్లో పార్టీ అధినేత కేసీఆర్ కరీంనగర్ నుంచి గెలుపొందగా మెదక్ నుంచి ఆలె నరేంద్ర, హన్మకొండ నుంచి బి.వినోద్ కుమార్, వరంగల్ నుంచి దరావత్ రవీందర్ నాయక్ ఉన్నారు. దేశంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ధ్యేయమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీకి ఉండగా, ఆ దిశగా యూపీఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందడుగు లేకపోవడంతో 2006లో బీఆర్ఎస్ యూపీఏ నుంచి వైదొలిగింది. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేశారు. అందులో మధుసూదన్‌రెడ్డి కూడా ఉన్నారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆదిలాబాద్ నుంచి పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. దీంతో కృంగిపోకుండా ఆయన తిరిగి న్యాయవాది వృత్తి చేపట్టడం గమనార్హం. 2015లో ఆయన గుండెపోటుతో మృతి చెందారు.

గురుకులాల్లో 98.91 శాతం ఉత్తీర్ణత

- ఆదిలాబాద్ రీజియన్‌లో 8 గురుకులాల్లో వందశాతం ఫలితాలు
- గతంలో కన్నా ఎంతో మెరుగు

బెల్లంపల్లి: పదోతరగతి వార్షిక ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు 98.91 శాతం ఉత్తీర్ణత సాధించారు. రీజియన్ వ్యాప్తంగా 17 గురుకులాలు ఉండగా ఎనిమిదింటిలో వందశాతం ఉత్తీర్ణత సాధించగా 9 గురుకులాలు కేవలం 2 నుంచి 3 శాతం తేడాతో వందశాతం కోల్పోవాల్సి వచ్చింది. ఓవరాల్‌గా రీజియన్ నుంచి 1,287 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,273 మంది ఉత్తీర్ణులుకాగా కేవలం 14 మంది అనుత్తీర్ణులయ్యారు. గతంలో కన్నా భిన్నంగా ఈసారి సంక్షేమ గురుకులాలు 'పది' ఫలితాల్లో రాణించడం విశేషం.

వందశాతం సాధించిన గురుకులాలు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17 గురుకులాలు ఉన్నాయి. ఆదిలాబాద్‌లోని సీఓఈ బాలికల గురుకుల విద్యాలయం, ఇచ్చోడ బాలుర గురుకులం వందశాతం ఫలితాలు సాధించి సత్తా చాటాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో రెబ్బెన (బాలికలు), కాగజ్‌నగర్(బాలికలు), సిర్పూర్ (టీ) బాలుర గురుకులాలు శతశాతం ఫలితాలతో రాణించి జయకేతనం ఎగుర వేశాయి. మంచిర్యాల జిల్లాలోని జైపూర్, బెల్లంపల్లి (సీఓఈ), కోటపల్లి బాలుర గురుకులాలు మెరుగైన ఫలితాలతో మెరిశాయి.

మిగతా గురుకులాల్లో ఉత్తీర్ణత

బోథ్ సంక్షేమ బాలికల గురుకులంలో 97.40 శాతం, సిర్పూర్ (టీ) బాలికల గురుకులంలో 98.40 శాతం, లక్సెట్టిపేట బాలికల గురుకులంలో 97.37 శాతం, బెల్లంపల్లి బాలికల గురుకులంలో 98.65 శాతం, చెన్నూర్ బాలికల గురుకులంలో 97.40 శాతం, మందమర్రి బాలికల గురుకులంలో 98.68 శాతం, ఆసిఫాబాద్ బాలుర గురుకులంలో 97.22 శాతం, కాసిపేట బాలుర గురుకులంలో 98.53 శాతం, మంచిర్యాల బాలుర గురుకులంలో 97.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

'గోమాస'కే నేతకానీల మద్దతు



మాట్లాడుతున్న నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు

శ్రీరాంపూర్: పెద్దపెల్లి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోమాస శ్రీనివాస్‌కే తమ కుల సంఘం మద్దతు ఉంటుందని నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆ సంఘం జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్ కనకయ్య, రాష్ట్ర అధ్యక్షుడు రాయమల్లు మాట్లాడారు. తమ సంఘం జాతీయ అధ్యక్షుడు గోమాసకు సంఘం తరపున మద్దతిస్తూ ఆయన గెలుపునకు కృషి చేస్తున్నామన్నారు. తమ కులం పేరుతో కొందరు వ్యక్తిగత స్వలాభం కోసం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు ప్రకటించారని, దీనికి తమ కులానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏనాడు దళితులను పట్టించుకోని వెంకటస్వామి కుటుంబానికి తామెలా మద్దతిస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు దుర్గం ఎల్లయ్య, నాయకులు దుర్గం నరసయ్య, నగేష్, రాంటెంకి శేఖర్, ప్రభాకర్, దామోదర్, శేషగిరి పాల్గొన్నారు.

'మనువాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మే డే'

మంచిర్యాలక్రైం: మనువాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మేడే జరుపుకుందామని సింగరేణి శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.పోచమల్లు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసి 4 చట్టాలుగా క్రోడీకరించాయన్నారు. దీంతో అనేక కంపెనీలు సగానికి పైగా కార్మికుల హక్కులను కాలరాసాయన్నారు. అందుకే నేడు నిర్వహించే మేడేను మనువాద ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా జరుపుకుందామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జీఎం బసివిరెడ్డి

జైపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో 'మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన డానియల్

మంచిర్యాలటౌన్: కాకతీయ యూనివర్సిటీలో జరిగిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ సెలక్షన్ పోటీలలో మంచిర్యాల మిమ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థి డి.డానియల్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉపేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేలో బెంగళూరులో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, పీడీ నూనె శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు.

గ్రామాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న గుడుంబా సామగ్రి

చింతలమానెపల్లి: మండలంలోని లంబడి హేట్టి, గుప్పగూడెం గ్రామాల్లో మంగళవారం డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాధిక్ పాషా ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని తనిఖీ చేసి గుడుంబా తయారు చేస్తున్న 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్న జర్పుల రవి, ధరావత్ జమునాబాయి, బానోత్ సోనిబాయి, ధరావత్ కళావతి, జర్పుల శ్యామ్‌లాల్, అజ్మీర పద్మ, జాటోత్ లాలు, పరశురాం, మంగిలాల్, రవి, బానోత్ సోనిబాయిలపై కేసు నమోదు చేశామన్నారు. 2వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రశ్నించే గొంతుకకు అవకాశం ఇవ్వండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: ప్రజా సమస్యలపై స్పందించి, పరిష్కరించడమే కాకుండా ఎవ్వరినైనా ప్రశ్నించే గొంతుక, పేదింటి బిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం దేవునిగూడ, ఇందన్‌పల్లి, రేండ్లగూడ, మొర్రిగూడ, టీజీపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో మరింత అభివృద్ధి జరగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పని చేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సయ్యద్ ఇషాక్, ఫసీఉల్లా, ఇందయ్య, రమేశ్, శిరీష్, కంటెం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

- లైన్‌మెన్లతో సమావేశమైన ఏడీ, ఏఈ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: 'అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఏడీ రవికుమార్, ఏఈ శ్రీనివాస్ లైన్‌మెన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమస్య తలెత్తితే లైన్‌మెన్‌లు తక్షణమే స్పందించాలన్నారు. సమస్య పెద్దదయితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



కిష్టంపేటలో నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చెన్నూర్: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవోలకు వీవీప్యాట్లు, ఈవీఎంలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సమయానికి ముందే పీవోలు, ఏపీవోలు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్వో చంద్రకళ, తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్, సదానందం పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

చెన్నూర్‌రూరల్/జైపూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ సూచించారు. చెన్నూర్ మండలం కిష్టంపేటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, జైపూర్ మండలం టేకుమట్లలో రైస్‌మిల్లు, కిష్టాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు.

నిర్వహణపై అవగాహన ఉండాలి

బెల్లంపల్లి: ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతీ అంశంపై అధికారులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): నిర్ణీత వయస్సు రాకముందే బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని డీసీపీవో బూర్ల మహేష్ అన్నారు. మండలంలోని కొండపల్లిలో ఓ బాలికకు వివాహం జరిపించేందుకు తల్లిదండ్రులు నిర్ణయించగా విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారులు మంగళవారం గ్రామానికి వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్లకు వివాహం చేయడం ద్వారా ఎదురయ్యే సమస్యలను వివరించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు జరిపించాలని, లేనిపక్షంలో బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజర్ అలీ, బాలరక్ష భవన్ సిబ్బంది బాల ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్: వేసవిలో సింగరేణి అందిస్తున్న క్రీడా శిక్షణ సద్విని చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) అరవిందరావు అన్నారు. మంగళవారం ప్రగతి మైదానంలో వేసవి క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన శిక్షకులతో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ బాక్సింగ్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో 25 రోజులపాటు శిక్షణ అందిస్తున్నామన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, కంపెనీ స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేరిట మోసగించిన కాంగ్రెస్

- పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



కార్మికులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

భీమారం/జైపూర్/శ్రీరాంపూర్: పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం ఆయన ఆర్కే 6 గని, ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్‌లలో కార్మికులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో మాట్లాడారు. కార్మికుడిగా 26 ఏళ్ల పని చేసిన తనకు కష్టసుఖాలు తెలుసని, తనను గెలిపిస్తే కార్మికుల గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తానని తెలిపారు. ఆగర్భ శ్రీమంతుడికి భూగర్భ గని కార్మికుడికి మధ్య ఎన్నికలుగా అభివర్ణించారు. ఎన్నికల ముందు లేని పోని హామీలు ఇచ్చిన సీఎం ఇప్పుడు అమలు చేయకుండా దాటవేత ధోరణిలో ముందుకెళ్తున్నారని ఆరోపించారు. ఇప్పటికీ రైతు బంధు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, ఆడపిల్లల పెళ్లికి తులం బంగారం ఇస్తామని చెప్పి ఒక్కరికీ ఇవ్వలేదని అన్నారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటు వేసి మళ్లీ మోసపోవద్దని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేస్తే ప్రజలకు రావాల్సిన హక్కుల కోసం పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, భీమారం మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

రామకృష్ణాపూర్: అమలుకు సాధ్యంకాని అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డాక్టర్ రాజారమేష్, గాండ్ల సమ్మయ్య, సుదర్శన్‌గౌడ్, జిలకర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలను ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదు'

తాండూర్: మాదిగలను ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ అన్నారు. మంగళవారం తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. మాదిగల ఓట్లు దండుకోవడం తప్పా చేస్తున్నదేమీ లేదన్నారు. మాదిగ యువతకు ఉద్యోగావకాశాలు కలగాలంటే కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుశ్నపల్లి నారాయణ, నాయకులు వడ్డూరి శ్రీనివాస్, కడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా జరుపుకోవాలి

బెల్లంపల్లి: ప్రపంచ కార్మికుల పర్వదినమైన మేడేను కార్మికులు ఘనంగా జరుపుకోవాలని టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి టీ.మణిరాంసింగ్ కోరారు. మంగళవారం మందమర్రి శాంతిఖని గనిపై మేడే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దల నారాయణ, హసన్, మల్లయ్య, తిరుపతి, చంద్రమౌళి, నవీన్‌కుమార్, ఖాశీం, కార్మికులు పాల్గొన్నారు.